

తంగళ్లపల్లి మండలం అంకిరెడ్డిపల్లిలో కేటీఆర్‌తో కరచాలనం చేస్తున్న మహిళలు

# గరీబోళ్లను ఆదుకున్నది కేసీఆరే..

- మనిషిని మనిషిలా చూసింది ఆయనే
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- సిరిసిల్ల నియోజకవర్గంలో పర్యటన

సిరిసిల్ల టౌన్/ ఎల్లారెడ్డిపేట, మే 15 : మనిషిని మనిషిలా చూసింది, గరీబోళ్లను ఆదుకున్నది తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆరేనని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. సిరిసిల్ల నియోజకవర్గంలో గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఆయన విస్తృతంగా పర్యటించారు. మొదట తంగళ్లపల్లి మండలం అంకిరెడ్డిపల్లెలో బీరప్ప కల్యాణ వేడుకలకు హాజరయ్యారు. వర్షాలు కురవాలని, కాలం మంచిగై బీరప్ప దయతో రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. జీవ సంపద దినదినాభివృద్ధి చెందాలని, శాంతిభద్రతలు బాగుండాలని కోరుకున్నారు. అక్కడి నుంచి సిరిసిల్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకుని పార్టీ కార్యకర్తలతో కాసేపు ముచ్చటించారు. రాత్రి 7 గంటలకు పెద్దూరులో నూతన వధూవరులను ఆశీర్వదించారు. అక్కడి నుంచి ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామంలోని దుర్వేషావలి దర్గా ఉర్సు ఉత్సవాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల ఆయన మాట్లాడారు. పదేండ్ల కాలంలో కేసీఆర్ ఏనాడూ మతం పేరుమీద రాజకీయాలు చేయలేదని, హిందువులున్నా, ముస్లింలున్నా.. అందరినీ ఒకేలాగా చూసుకున్నారని గుర్తు చేశారు. బతుకమ్మ పండుగొస్తే హిందూ మహిళలకు, రంజాన్ పండుగొస్తే ముస్లిం ఆడబిడ్డలకు, క్రిస్మస్ వస్తే క్రిస్టియన్ ఆడబిడ్డలకు చీరెలు పెట్టారని తెలిపారు. రాజకీయాలు మాట్లాడేందుకు తాను రాలేదని, దుర్వేషావలి బాబా ఆశీస్సులతో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. మతం, కులం పేరు మీద పంచాయితీ లేకుండా అందరం కలిసిమెలిసి అన్నాదమ్ములలెక్క ఉండాలని, దేశం మంచి కోసం కష్టపడి కొట్లాడుదామని ఆ బాబాను వేడుకుంటున్నట్లు చెప్పారు. అంతకు ముందు ముగ్దుం మొయినొద్దీన్ చెప్పిన ఉర్దూ షాయరీని ఉటంకిస్తూ అందరం కలిసి కట్టుగా నడవాలని, పిల్లల మంచి భవిష్యత్తును కాపాడుకునేలా అప్రమత్తంగా ఉండాలని, పెద్దలు చూపిన గంగా, జమునా, తహజీబ్ తీరున కలిసి బతికే పరంపరను కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. హిందూ, ముస్లిం, సిక్కు అందరం కలిసి నడవాలని సూచించారు. అలాగే, దర్గాపై కప్పేందుకు ఉర్సు నిర్వాహకులు షేక్ అజీజ్‌కు చాదర్, పూలను అందించారు. ఇక్కడ నాఫ్స్‌కాబ్ మాజీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సెస్ డైరెక్టర్ వర్స కృష్ణహరి, పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, మాజీ జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, నాయకులు షేక్ గౌస్, షేక్ ఉస్మాన్, సింగారం దేవరాజు, గనగోని మల్లేశం, మంగోలి నర్సాగౌడ్, ఎండీ చాంద్, జబ్బార్, ఇర్ఫాన్ ఉన్నారు.



ఎల్లారెడ్డిపేట: సింగారం ఉర్సు ఉత్సవ నిర్వాహకుడు షేక్ అజీజ్‌కు చాదర్ అందిస్తున్న కేటీఆర్

- వానకాలంలో మూడు నెలలు ఎదురు చూపులు
- యాసంగిలో ఇంకా మొదలవని ₹500 బోనస్ చెల్లింపులు
- నెలన్నరగా వేచి చూస్తున్న రైతులు
- భరోసా ఇవ్వలేని స్థితిలో అధికారులు



# సన్నాలకు బోనస్ ఏది?

సన్నరకం ధాన్యానికి ₹500 బోనస్ ఇస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం యాసంగి సీజన్‌లో ఇప్పటి వరకు ఒక్క రైతు ఖాతాలో నయాపైసా కూడా జమ చేయలేదు. గత వానకాలంలో విక్రయించిన సన్నాలకు మూడు నెలల తర్వాత జమ చేయగా, ఈ యాసంగిలో బోనస్ ఎప్పుడు వస్తదో తెలియడం లేదు. సకాలంలో బోనస్ వస్తుందని ఆశించిన రైతులకు మరోసారి నిరాశే మిగులుతున్నది. రాష్ట్ర ఖజానా నిరాశాజనకంగా ఉందని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్న నేపథ్యంలో బోనస్ వస్తుందా.. లేదా..? అని రైతులు మీమాంసలో పడ్డారు. వానకాలం మాదిరిగానే ఆలస్యమవుతుందా.. లేదంటే ఆర్థిక పరిస్థితి బాగో లేదని ఎత్తేస్తారా..? అని ఆందోళన చెందుతున్నారు.

కరీంనగర్, మే 15(నమస్తే తెలంగాణ) : పండించిన ప్రతి పంటకూ కేంద్రం ఇచ్చే కనీస మద్దతు ధరపై ₹500 బోనస్ ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఆ తర్వాత అనేక హామీలు తప్పినట్లుగానే దీనిని కూడా విస్మరించింది. అన్ని రకాల పంట ఉత్పత్తులపై బోనస్ ఇస్తామని చెప్పి తీరా కేవలం సన్నరకం ధాన్యానికి మాత్రమే వర్తిస్తుందని చేతులెత్తేసింది. కనీసం సన్న రకాలకైనా సరిగ్గా ఇస్తున్నారా..? అంటే అదీ లేదు. దొడ్డురకం ధాన్యంతో కలిపి సన్నరకాలను కొనుగోలు చేస్తున్నారు. కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధర ₹2,320 రెండు రకాల ధాన్యానికి చెల్లిస్తున్నారు. అయితే, సన్నాలపై క్వింటాల్‌కు ₹500 బోనస్ వస్తుందనే ఆశతో రైతులు ఈ రకం వరి సాగు చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సన్న రకాలు



తెచ్చిన తర్వాత కొలతలు నిర్వహిస్తున్నారు. అనుకున్న ప్రకారంగా ఉంటేనే సన్నాలుగా నిర్ధారించి కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడి వరకు బాగానే ఉంది. కొనుగోళ్లు పూర్తయిన తర్వాత దొడ్డు రకానికి ఇచ్చినట్టుగానే కనీస మద్దతు ధర ప్రకారం క్వింటాల్‌కు ₹2,320 రైతుల ఖాతాల్లో వేస్తున్నారు. బోనస్ మాత్రం చెల్లించడం లేదు. గత వానకాలంలో కొనుగోలు చేసిన సన్నాలకు సంబంధించిన బోనస్ మూడు నెలల తర్వాత రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఇంకా కొందరికి అది కూడా అందలేదు. ఈ సీజన్‌లోనైనా కొనుగోళ్లు జరిగిన వెంటనే కనీస మద్దతు ధరతోపాటు సన్నాలకు బోనస్ కూడా చెల్లిస్తారని రైతులు ఆశించారు. కానీ, ప్రభుత్వ వైఖరిలో ఏ మాత్రం మార్పు రాలేదు. గత ఇరవై ఇరవైదు రోజులుగా సన్నరకం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుండగా, బోనస్ ఆశించిన రైతులకు నిరాశే ఎదురవుతున్నది.


## కరీంనగర్ జిల్లాలో ₹11.50 కోట్ల బోనస్ పెండింగ్

కరీంనగర్ జిల్లాలో ఇప్పటి వరకు 32 వేలకుపైగా రైతుల నుంచి 2.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలుస్తున్నది. అందుకుగాను ₹487 కోట్ల వరకు చెల్లించాల్సి ఉండగా ₹367 కోట్ల వరకు చెల్లించినట్లు తెలుస్తున్నది. అందులో దొడ్డు రకం 1.88 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, సన్న రకం సుమారు 23 వేల మెట్రిక్ టన్నుల వరకు ఉంది. దీనికి ₹11.50 కోట్ల వరకు రైతులకు బోనస్ రావాల్సి ఉన్నది. కానీ, ఇప్పటి వరకు ఒక్క రైతు ఖాతాలో కూడా సన్నాలకు బోనస్ జమ చేసింది లేదు.

## స్పష్టత కరువు

సన్నరకం ధాన్యానికి ఇచ్చే బోనస్ విషయంలో అధికారులు కూడా స్పష్టత ఇవ్వడం లేదు. పైగా సన్నాలు దించుకోబోమని గత వానకాలం సీజన్‌లో మిల్లర్లు పేచీకి దిగడంతో నానా తంటాలు పడి అధికారులు వారిని ఒప్పించారు. ఈసారి కూడా ఇదే పరిస్థితి ఉన్నా మిల్లర్లు మాత్రం పెద్దగా అనుకూలంగా లేరు. అయితే, బోనస్ విషయంలో రైతులు వ్యక్తం చేస్తున్న అనుమానాలకు అధికారుల నుంచి సరైన సమాధానం రావడం లేదు. అది ప్రభుత్వం చేతిలో ఉందని, నిర్ణయం తీసుకోవాల్సింది ప్రభుత్వమేనని చెబుతున్నారు. రాష్ట్ర ఖజానా ఆశించిన రీతిలో లేదని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో సన్నాలకు బోనస్ ఇస్తారా.. లేదా? అనే అనుమానాలు రైతులు వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజూ సేకరించే సన్నరకం ధాన్యంపై ఎప్పటికప్పుడు బోనస్‌పై నివేదికలు ఇస్తున్నామని అధికారులు చెబుతున్నారు. అయితే, బోనస్ ఎప్పుడు విడుదల చేస్తారనే విషయంలో మాత్రం వారిదగ్గర స్పష్టత లేకుండా పోయింది. గత సీజన్‌లాగే ఆలస్యంగా రావచ్చని మాత్రమే చెబుతుండగా, రైతులకు మాత్రం భరోసా ఇవ్వడం లేదు. రేషన్ కార్డులపై సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ప్రభుత్వం సన్నాలను విరివిగా పండించాలని చెబుతున్నా.. బోనస్ విషయంలో మాత్రం స్పష్టత ఇవ్వకపోవడంతో రైతుల్లో ఆందోళన కనిపిస్తున్నది.

# సర్వే చేయించుకున్నరు.. పైసలిస్తలేరు!



- ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే సిబ్బందికి అందని పారితోషికం?
- ఐదు నెలలుగా ఎదురుచూపులు
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- పట్టించుకోని అధికారులు

ఐదు నెలల క్రితం ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే చేయించిన రాష్ట్ర ప్రభుత్వం, తీరా పనిపూర్తయ్యాక సర్వే సిబ్బందికి మొండిచేయి చూపింది. గణన ప్రారంభానికి ముందే పారితోషికం నిధులు విడుదల చేసి ఆశలు రేకెత్తించినా.. ఆ తర్వాత ఇవ్వకుండా చోద్యం చూస్తున్నది. అధికారులు రెమ్యూనరేషన్ డబ్బులు ఖాతాల్లో జమచేసేందుకు ఏర్పాట్లు చేస్తుండగానే వెనక్కి తీసుకొని ఇతర అవసరాలకు వినియోగించుకున్నట్టు తెలుస్తుండగా, సిబ్బంది ఆగ్రహిస్తున్నారు. కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ విసిగివేసారి పోతున్నారు. పారితోషికం ఎప్పుడొస్తుందా..? అని ఎదురుచూపులు చూస్తున్నారు.

కరీంనగర్ కలెక్టరేట్, మే 15: స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతుల కులాలకు రిజర్వేషన్ల అమలు కోసం ప్రభుత్వం గతేడాది నవంబర్‌లో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన (ఇంటింటి సమగ్ర కుటుంబ) సర్వే చేపట్టింది. కరీంనగర్ జిల్లాలో 3,171మంది సిబ్బందిని సర్వే కోసం వినియోగించగా, అందులో 2,864 మంది ఎన్యూమరేటర్లు, 287 మంది సూపర్‌వైజర్లు, 20 మంది ప్రత్యేకాధికారులతో పాటు సర్వేలో సేకరించిన వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చేందుకు 2,256 మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లను వినియోగించారు. సర్వే విధుల్లో వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు, జూనియర్ అసిస్టెంట్లు, మెప్మా రిసోర్స్‌పర్సన్లు, సీవోలతో పాటు పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, మండల స్థాయి అధికారులతో పాటు ప్రైవేట్ సిబ్బంది పాల్గొన్నారు. నవంబర్ 9 నుంచి 24 వరకు ఇంటింటికీ తిరిగి సర్వే చేపట్టి, కుటుంబాల సమాచారాన్ని ప్రత్యేకంగా ముద్రించిన ఫాంలలో నమోదు చేశారు.

## ప్రారంభానికి ముందు మంజూరు.. తర్వాత వెనక్కి..

అనుకున్నట్టుగా పదిహేను రోజులపాటు సిబ్బంది సర్వే చేసి పూర్తి వివరాలు సేకరించగా, అందులో పాల్గొన్న ఎన్యూమరేటర్లకు ఒక్కొక్కరికీ ₹10వేలు, సూపర్‌వైజర్లకు ₹12వేలు, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ప్రైవేట్ వ్యక్తులైతే ఒక్క షిఫ్టుకు ₹750 చొప్పున, ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహించే కాంట్రాక్టు ఆపరేటర్లకు అయితే ₹350 చొప్పున ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. సర్వే ప్రారంభానికి ముందే నిధులు విడుదల చేసింది. సర్వే పూర్తికాగానే సిబ్బంది ఖాతాల్లో జమచేయాలంటూ సూచించగా, అందుకనుగుణంగా అధికారులు సిద్ధమయ్యారు. సిబ్బంది బ్యాంకు ఖాతాల వివరాలు జిల్లా కోశాగార కార్యాలయానికి అందజేశారు. అయితే, అంతలోనే ప్రభుత్వం విడుదల చేసిన డబ్బులు వెనక్కుతీసుకుని, ఇతర అవసరాలకు వినియోగించినట్లు తెలుస్తుండగా, పారితోషికం కోసం సిబ్బంది పడుతున్న బాధలు వర్ణణాతీతంగా మారాయి. సర్వే చేసినవారిలో కొద్దిమంది మాత్రమే ప్రభుత్వ ఉద్యోగులుండగా, మిగిలినవారు ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులు, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగులే. ప్రభుత్వం పారితోషికం అందిస్తున్నామని సంబంధిత సంస్థలకు పేర్కొనడంతో వారు విధులు నిర్వహించే సంస్థలు పదిహేను రోజుల వేతనం ఇవ్వలేదు. ఫలితంగా అటు రెమ్యూనరేషన్ రాక, ఇటు వేతనం రాక నరకం చూశారు. మరోవైపు అసలు పారితోషికమే పంపిణీ చేయరంటూ కొంతమంది ప్రచారం చేస్తుండగా, రోజులతరబడి తాము పడ్డ కష్టం ఉత్తదేనా..? అని ఆందోళన చెందుతున్నారు. అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరిగి వేసారి పోతున్నా తమను పట్టించుకునే నాథుడే లేడని వాపోతున్నారు. అసలే అత్తెసరు వేతనంతో బతుకుతున్న తమను ఇలా ఇబ్బందులు పెట్టొద్దని, వెంటనే పారితోషికం విడుదల చేయాలని కోరుతున్నారు.

## ఇస్తరా.. ఇవ్వరా..?

పదిహేను నుంచి ఇరవై రోజుల పాటు కుటుంబం, పిల్లలను వదిలి సమగ్ర ఇంటింటి సర్వే చేశాం. సర్వే ముగిసిన వెంటనే రెమ్యూనరేషన్ జమచేస్తామని అధికారులు చెప్పారు. కానీ, ఐదు నెలలైనా డబ్బులు జమ కాలేదు. మాతో పాటు మరో ఇద్దరు ప్రైవేట్ వ్యక్తులను కూడా సర్వే కోసం తీసుకెళ్లాం. వారు డబ్బుల కోసం మా ఇంటి చుట్టూ తిరుగుతున్నారు. గతంలో ఎన్నో సర్వేలు చేసినం కానీ ఇలా ఇబ్బంది కాలేదు. కొంతమంది సర్వే డబ్బులు ఇక రావని అంటున్నరు. డబ్బులివ్వకపోతే ఎలా..? ప్రైవేటు వ్యక్తులకు డబ్బులు ఎవరు చెల్లించాలి? ఇది కరెక్టు కాదు. వెంటనే పారితోషికం విడుదల చేయాలి.

**- విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్**



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న సుంకె రవిశంకర్

# అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ.. అన్నదాతలపై లేదా..?

- కొనుగోళ్లలో జాప్యంతో ఇబ్బందులు పడుతున్నా పట్టదా..?
- సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే సుంకె ఫైర్
- తడగొండలోని కొనుగోలు కేంద్రం పరిశీలన

బోయినపల్లి రూరల్, మే15: ధాన్యం కొనుగోళ్లలో జాప్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా సీఎం రేవంత్‌రెడ్డికి పట్టడం లేదని, అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ, అన్నదాతలపై లేకపోయిందని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆగ్రహించారు. రెండ్రోజుల క్రితం కురిసిన వర్షానికి బోయినపల్లి ప్యాక్స్ సెంటర్ పరిధిలోని తడగొండలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసిపోగా, గురువారం బీఆర్‌ఎస్ నాయకులతో వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తమ గోడు వెల్లబోసుకున్నారు. బస్తాలో 42 కిలోల వడ్లు తూకం వేసి 39కిలోలే లెక్కగడుతున్నారని, అధికారులు పట్టించుకోవడం లేదని సుంకె దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం సుంకె మాట్లాడారు. ఐకేపీ సెంటర్‌కు పదిహేను రోజుల కింద వడ్లు తీసుకవచ్చినా కాంటా వేయకపోవడంతోనే ధాన్యం తడిసిపోయిందన్నారు. సెంటర్‌లో హమాలీలు, గన్నీ సంచులు, లారీల కొరత తీవ్రంగా ఉందని, టార్పాలిన్లు కూడా ఇవ్వలేదని, సమయానికి వడ్లు కొంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎక్కడ ధాన్యం కొనడం లేదని, రైతులు దయనీయ పరిస్థితిలో ఉన్నారని, ధాన్యం కుప్పలపైనే ప్రాణాలు కోల్పోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేకపోవడం బాధాకరమన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్, ఊరూరా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయించి వెనువెంటనే కొనుగోళ్లు చేయించారని, కాంగ్రెస్ మాత్రం రైతన్నను ముప్పుతిప్పలు పెడుతున్నదని దుయ్యబట్టారు. ఆయన వెంట మండల కో-ఆప్షన్ మాజీ సభ్యుడు మహ్మద్ అజ్జు, మాజీ సర్పంచ్ చిందం రమేశ్, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గుంటి శంకర్, మండల నాయకులు నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, బాపురెడ్డి, లింగయ్య, బత్తిని కమల్‌గౌడ్, రాజేశ్ ఉన్నారు.



సేకరించిన తునికాకును కట్టలు కడుతున్న మహిళలు

# తునికాకు సేకరణకు ప్రోత్సాహమేది?

- ఒక్కో కట్టకు చెల్లించేది ₹3 మాత్రమే
- పెద్దపల్లి జిల్లాలో సేకరణపై నిరాసక్తత
- ఏడు యూనిట్లకు అమ్ముడు పోయింది మూడే
- ధర పెంచాలంటున్న ఏజెన్సీ ప్రజలు

తునికాకు సేకరణకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువైంది. ఏండ్లు గడుస్తున్నా ఆకు ధర పెంచకపోవడం, ఒక్కో కట్టకు ₹3 మాత్రమే చెల్లిస్తుండడంతో ఏజెన్సీ ప్రజల్లో నిరాసక్తత వ్యక్తమవుతున్నది. పెద్దపల్లి, మంథని రేంజ్‌లలో ఈ సీజన్‌లో 76లక్షల ఆకుల సేకరణే లక్ష్యంగా ఏడు యూనిట్లకు (47 కల్లాలు) టెండర్లు పిలువగా, కేవలం మూడు యూనిట్లు (18 కల్లాలు) మాత్రమే ఖరారు కావడం పరిస్థితికి అద్దంపడుతున్నది. రేటు పెంచితేనే తమకు గిట్టుబాటు అవుతుందని, ఆ దిశగా ఆలోచన చేయాలని గిరిజన ప్రజానీకం కోరుతున్నది.

## రేటు పెంచాలి



మేం కూలీ నాలీ జేసుకొని బతికేటోళ్లం. ఆకుల సీజన్ అచ్చిందంటే ఏరవోతం. ఇంటికి అచ్చిన సుట్టాలు అందరం కలిసి ఆకు ఏరుకచ్చి కట్టలుగట్టి అమ్ముతం. కానీ, ఏం లాభం? ఇంత ధర పెరిగితేనే మాకింత పాయిదా. ప్రభుత్వం రేటు పెంచితేనే మాకింత మేతలైది.

**- జన్నె రాజేశ్వరి, గోపాల్‌పూర్ (మంథని మండలం)**

పెద్దపల్లి, మే 15 (నమస్తే తెలంగాణ): పెద్దపల్లి, మంథని రేంజ్‌ల్లో ఈ సీజన్‌లో ఏడు యూనిట్లను కేటాయించారు. కానీ, మూడు యూనిట్లు మాత్రమే విక్రయించడంతో 3వేల స్టాండర్డు బ్యాగులను (28లక్షల ఆకులు) సేకరణకు అటవీశాఖ అధికారులు ప్రణాళికలు వేశారు. మంథని ఫారెస్ట్ రేంజ్ పరిధిలో ముత్తారం యూనిట్ పరిధిలో ధర్యాపూర్, హరిపురం, కేషన్‌పల్లి, మచ్చుపేట, మైదంబండ, పారుపల్లి, గ్రామాల్లో 900 స్టాండర్డు బ్యాగులు, ఖమ్మంపల్లి యూనిట్ పరిధిలోని చిన్నఓదాల, గోపాల్‌పూర్, ధర్మారం, జిల్లెల్లపల్లి-ఏ, జిల్లెల్లపల్లి బీ, ఖమ్మంపల్లి, ఏ, బీ, సీతంపల్లి గ్రామాల్లో 1700 స్టాండర్డు బ్యాగులు, కల్వచర్ల యూనిట్ పరిధిలోని రత్నాపూర్, సబ్బితం, వెన్నంపల్లి, గౌరెడ్డిపేట గ్రామాల్లో 200 స్టాండర్డ్ బ్యాగులు లక్ష్యంగా మొత్తం 18 కల్లాలను ఏర్పాటు చేశారు. అయితే ఒక్కో స్టాండర్డ్ బ్యాగులో వెయ్యి కట్టలు ఉండనుండగా, ఒక్కో కట్టకు ప్రభుత్వం ₹3 మాత్రమే చెల్లిస్తున్నది. రోజుల తరబడి ఒక బ్యాగు నింపిన ఏజెన్సీ బిడ్డలకు దక్కేది ₹3వేలు మాత్రమే. ఈ క్రమంలోనే ఆకు సేకరణపై ఏటేటా ఆసక్తి తగ్గిపోతున్నది.

## ఆకు ధర పెరిగితేనే లాభం



ఆకు ధర పెరిగితేనే మాకు ఆదాయం వస్తది. కానీ, ఏండ్ల నుంచి ఒకే రేటు ఉంటంది. ఏం లాభమైతలేదు. మేం ఏటా ఈ సీజన్ అచ్చిందంటే అడివికి వొయ్యి తునికాకును ఏరుతం. పొద్దుగాల నాలుగు గంటలకు అడివికి పోతే ఇంటికచ్చే సరికి తొమ్మిది, పదైతది. మోపెడన్ని తీసుకొని అత్తం. అన్ని ఒక్కకాడ కుప్పేసుకొని కట్టలు కడుతం. సాయంత్రం కల్లానికి పొయ్యి అమ్ముకత్తం.

**- జే ప్రమీల, జిల్లెల్లపల్లి (ముత్తారం మండలం)**



మొలకలు వచ్చి రంగు మారిన వడ్లను చూపిస్తున్న రైతు బాలనర్సు

# వడ్లు కొనకపాయె.. మొలక రావట్టె!

- 25 రోజులుగా కేంద్రంలో రైతుల పడిగాపులు
- వానకు నాని రంగు మారిన ధాన్యం

గంభీరావుపేట, మే 15 : కొనుగోలు కేంద్రాల్లో సకాలంలో వడ్లు కొనకపోవడంతో వానకు నాని రంగుమారుతున్నాయి. గంభీరావుపేట మండల కేంద్రంలోని కాకులగుట్ట కేంద్రంలో బండపై ఆరబోసిన ధాన్యం వానకు తడిసి మొలకెత్తాయి. బరిగెల గూడెంకాలనీకి చెందిన శనిగరం బాలనర్సు 25 రోజుల క్రితం కొనుగోలు కేంద్రానికి వడ్లు తీసుకొచ్చాడు. ఇప్పటి వరకు కొనకపోవడంతో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు ధాన్యం రంగు మారి అడుగు భాగం నుంచి మొలక రావడంతో కన్నీరు పెట్టాడు. అడ్డగోలు పెట్టుబడి పెట్టి, ఆరుగాలం కష్టపడి పండించిన వడ్లను అమ్ముకోవడానికి తెస్తే వానకు నాని ఇలా మొలకెత్తుతున్నాయని, అమ్మడానికి నెల రోజులు పడుతుందా? అంటూ ఆందోళన చెందుతున్నాడు.